# తల్లిప్రేమ

గుడ్ల నీళ్లు కుక్కుకుని ఏడుస్తున్నది. తన ఏడుపే తనది. నేను పావుగంట నిలబడ్డా నాకేసి చూడలేదు.

"ఏవమ్మా ఏడుస్తున్నావు?" అన్నాను.

"ఏవవకేం చెయ్యను. నాయనా, నా బంగారు నాయనేం చేస్తున్నాడో! ఎట్లా బతుకుతున్నాడో! నేను లేకపోతే వాడికి ప్రపంచమే లేదు. ఒక్క క్షణం కనిపించక పోతే కాలుగాలిన పిల్లల్లే తిరిగేవాడు. పాపిష్టి చచ్చిందాన్ని. విసుక్కునేదాన్ని. నేను లేకుండా ఇంతకాలం ఎట్లా ఉన్నాడో!"

"ఆడవాళ్లింత అర్ధాయుస్సుగా ఉన్నప్పుడు తల్లుల్లేని వాళ్లకి తక్కువేమిటి? వాళ్లతో బాటే నీ కొడుకూనూ!"

"అయ్యో. మావాడందరివంటి వాడు కాదు. నాయనా. వొట్టి అర్భకుడు. వారాని కోసారి జరం వచ్చేది."

"నీకు పెంపకం చాతకాకనేమో! నీ సహాయం లేకుండా నీ కొడుకారోగ్యవంతుడయి నాడేమో."

"ఓరి పుట్టుకుంకా! నీకు తల్లి ఉంటే ఇట్లా మాట్లాడవు!"

"సరే పోనియ్యి. నివ్వుంటే నీ కొడుక్కు ఇంకేం చేసుకునే దానివి?"

"నయానో భయానో ఇంత చదువు చెప్పించుకునేదాన్ని. మావాడికి చదువంటే పడిదేకాదు. పిల్లలకు చదువంటే భయం కాదా ఏమిటి?"

"నీ కొడ్డుక్కిదే నూరిపోశావా?"

"నూరి పోసేదేమిటి? వాడికి తెలీదా? అక్షరాభ్యాసం రోజునే బావురుమని ఏడిచాడు నా తండ్రి."

"అప్పటికే వాణ్ణి తరిఫీదు చేశావు గామాలు."

"నేనా? నీ నోరు పడా ... బ....డికి పోతాడని రోజూ కానీ అర్ధణా ఇచ్చేదాన్ని. వాడు మరీ మొండితనం చేస్తే అణా బేడా కూడా ఇచ్చేదాన్ని. అవన్నీ తీసుకుని కూడా వాడు బడికి పొయ్యేవాడు కాదు."

"సందేహమేముందీ.... నీ కొడుక్కు ఇంకా ఏం చేసుకునే దానివి?"

"తల్లినైన తర్వాత ఏం చేసుకోలేను. అసలే వాడు దొంగతనాలూ, అల్లరులూ మరిగాడు. ఆ నెపం మీద అందరూ వాడిమీదికి ఒంటి కాలిమీద వచ్చేవాళ్లే. వాళ్ల పిల్లలంతా బుద్ధిమంతులైనట్టు! నేనుంటే నా బిడ్డణ్ణి ఆదుకునేదాన్ని .... నా తండ్రి కాకుల చేత ఎన్ని మాటలు పడుతున్నాడో. ఎంత బాధ పడుతున్నాడో!"

"ఓ వేళ నీ కొడుకు మారాడేమో - నువు ఇవతలపడ్డ తరవాత! ఇప్పుడందరి వంటివాడే అయినాడేమో!"

"ఓరి మాలకాకీ! నీ మాటలు చూస్తే మండుకొస్తున్నది. నా కొడుకట్లా ఒక్క నాటికి మారడు!"

"నీ ఆత్మ విశ్వాసం మటుకు చాలా గొప్పగా ఉంది."

"అంటే?"

"ఎందుకులే పోనీ!... ఇంకా ఏం చేసుకుని ఉండేదానికి కొడుక్కి?"

"అన్నిటికన్నా ముఖ్యంగా పెళ్లాంమాట అత్తమామల మాటా వినకుండా చేసి ఉండేదాన్ని."

"ఏం వింటే?"

"వింటే ఇంకెందుకన్నా పనికొస్తాడా?"

"ఎట్లాగూ ఎందుకూ పనికిరానివాణ్ణే కంటివిగా?"

"ఇక అంతేనా? కాస్తన్నా నా మాట విని బాగుపడాతాడా? అత్తవారన్న తరవాత పనికొచ్చేమాట చెబుతారా?"

"ఏమో. మొత్తం మీద నవు దాటిపోవటమే నీ కొడుక్కు మేలయింది. చదువుకున్నాడు. బుద్ధిమంతుడనిపించుకున్నాడు. ఉద్యోగం సంపాదించుకున్నాడు. రాయల్లే ఆరోగ్యంగా తయారయినాడు. పెళ్లి చేసుకున్నాడు. పెళ్లాం ప్రేమ సంపాదించాడు. పెళ్లాన్ని పోగొట్టుకున్నాడు. అన్నీ అయిపోయినై. విచారించకు. అట్లా వెర్రిగా చూడకు - నేనే నీ కొడుకును. నిన్ను చూడటానికి రాలేదు గాని - చూసినందుకు సంతోషం కలగలేదు. వెళ్లొస్తా!"

***ముద్రణ : ఆనందవాణి, 10 డిసెంబర్ 1944***